సాక్షి అనంతపురం

శనివారం। 23। ఆగస్టు। 2025



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.35

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.35, కనిష్టం రూ.27, సరాసరి రూ.20 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.9°/21.6°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

25న డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్ బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్ అహమ్మద్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న సర్టిఫికెట్ల పరిశీలన చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు సిద్ధం చేసింది. అనంతపురం రూరల్ పరిధిలోని ఆలమూరు రోడ్డులోని బాలాజీ ఎంసీఏ కళాశాల వేదికగా సర్టిఫికెట్ల పరిశీలన చేయనున్నారు. ఏర్పాట్లను శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబు, అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్ అహమ్మద్ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలన కోసం మొత్తం 18 బృందాలను నియమించారు. అన్ని కేడర్ల పోస్టులు కలిపి జిల్లాలో మొత్తం 807 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇదిలా ఉండగా సర్టిఫికెట్ల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన బృందాలకు శనివారం బాలాజీ ఎంసీఏ కళాశాలలో శిక్షణ ఉంటుందని డీఈఓ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే శిక్షణకు ఎంపిక చేసిన సభ్యులందరూ తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదల

డీఎస్సీ-25కు సంబంధించి అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను విద్యాశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసింది. జాబితాలను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https:// apdsc. apcfss. inలో, జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్లోనూ ఉంచారు. వివిధ కేటగిరీ పోస్టులకు జోన్ ఆఫ్ కన్సిడరేషన్ లోకి వచ్చిన అభ్యర్థులకు వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ఐడీలు ద్వారా కాల్ లెటర్ అందజేయబడతాయని అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థులు తమ వ్యక్తిగత లాగిన్ ద్వారా కాల్ లెటర్‌ను డౌన్లోడ్ చేసుకొని అందులో పేర్కొన్న సూచనలను అనుసరించాలని వెల్లడించారు. సదరు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడు సెట్లు సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సర్టిఫికెట్ల పరిశీలనకు వ్యక్తిగతంగా హాజరుకావాలని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కు హాజరు కావడానికి ముందే ఆయా సర్టిఫికెట్లను వెబ్‌సైట్లో అప్లోడ్ చేయాలని సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని, అర్హతలేని అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. అలాంటి సందర్భంలో తదుపరి మెరిట్లో ఉన్న అభ్యర్థిని సర్టిఫికెట్ పరిశీలనకు పిలుస్తామని స్పష్టం చేశారు.

పండగలకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

గుంతకల్లు: దీపావళి, దసరా పండగలను దృష్టిలో ఉంచుకొని జోనల్ వ్యాప్తంగా దాదాపు 170 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో గుంతకల్లు డివిజన్‌లోని ఉమ్మడి అనంతపురం జిల్లా మీదుగా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నట్లు వివరించారు. తిరుపతి - చర్లోపల్లి మధ్య (07011) సెప్టెంబర్ 5 నుంచి 26 వరకు వారాంతపు (శుక్రవారం) ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా (4సర్వీసులు) నడుపుతామన్నారు. తిరిగి చర్లోపల్లి - తిరుపతి (07012) సెప్టెంబర్ 6 నుంచి 27 వరకు వారాంతపు (శనివారం) ఎక్స్‌ప్రెస్ రైళ్లు (4 సర్వీసులు) నడపనున్నట్లు వెల్లడించారు. ఇక తిరుపతి - హిసర్ (07717) ఎక్స్‌ప్రెస్ రైళ్లు అక్టోబర్ 1 (బుధ) నుంచి నవంబర్ 26 వరకు వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా నడపనున్నట్లు తెలిపారు. తిరిగి రైలు హిసర్ - తిరుపతి (07718) మధ్య అక్టోబర్ 5 (ఆదివారం) నుంచి నవంబర్ 30 వరకు నడుపుతామని పేర్కొన్నారు. ఇక ఈ నెల 26న బెంగళూరు - బీదర్, 27న బీదర్ - బెంగళూరు మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు తెలిపారు.

ఎంటెక్, ఎంఫార్మసీ ఫలితాలు విడుదల



ఫలితాలు ప్రకటిస్తున్న డీఓఏ నాగప్రసాద్ నాయుడు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో జూలైలో నిర్వహించిన ఎంటెక్ రెండో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ ఎంటెక్ ఒకటి, మూడవ సెమిస్టర్ (ఆర్-21) సప్లిమెంటరీ, ఎంఫార్మసీ రెండో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంఫార్మసీ ఒకటో, మూడో సెమిస్టర్ (ఆర్-21) సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి. శంకర శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాల పంజా

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న తేలికపాటి వర్షాలు, శీతాకాలాన్ని తలపించేలా చల్లగాలులతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈ నేపథ్యంలో ప్రజలపై వ్యాధులు పంజా విసురుతున్నాయి. చిన్నారులు మొదలుకొని పెద్దల వరకు జ్వరం, దగ్గు, జలుబు, ఒళ్లు నొప్పులు, శ్వాసకోశ తదితర సమస్యలతో బాధపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు ప్రజలను వణికిస్తున్నాయి.



సర్వజనాస్పత్రి చిన్నపిల్లల వార్డు ఐసీసీయూలో చికిత్స పొందుతున్న దృశ్యం

- కిక్కిరిసిన సర్వజనాస్పత్రి
- మంచాలు సరిపడక అవస్థలు
- వైద్య సేవలు మెరుగు పరచాలని కోరుతున్న ప్రజలు



అనంతపురం సర్వజనాస్పత్రిలో జ్వరాలతో చేరిన చిన్నారులు

అనంతపురం మెడికల్: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు వణికిస్తున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులతో పాటు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రులకు రోగులు పోటెత్తుతున్నారు. సర్వజనాస్పత్రిలో మెడిసిన్ విభాగం, చిన్నపిల్లల విభాగంలో మొత్తం 240 పడకలు అందుబాటులో ఉన్నాయి. చిన్నపిల్లల వార్డులో 90 పడకలు ఉంటే 150 మంది అడ్మిషన్‌లో ఉన్నారు. ఇందులో 70 శాతం మంది జ్వరం, దగ్గు, జలుబు, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారే. ఇక మెడిసిన్ విభాగాల్లో మరో 150 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. అక్కడ కూడా విష జ్వరాల బాధితులు ఉన్నారు. పడకలు చాలకపోవడంతో ఒకే మంచంపై ఇద్దరు, ముగ్గురిని ఉంచారు. దీని వల్ల క్రాస్ ఇన్ఫెక్షన్లు సోకే ప్రమాదం లేకపోలేదు. అవుట్ పేషెంట్ కింద చూపించుకుంటున్న రోగులు రోజువారీగా 2,500 మంది ఉంటున్నారు. ఇందులో కూడా 50 శాతానికి పైగా జ్వరపీడితులే ఉంటుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైద్య సేవలు మెరుగపరచాలని, జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తగా ఉండాలి..

వాతావరణ మార్పుల నేపథ్యంలో జ్వరాలతో పాటు ఊపిరితిత్తుల సమస్యలున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి. చెవి, గొంతు సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువ. ఆర్ఎంపీల వద్దకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులను సంప్రదించడమే ఉత్తమమని సీనియర్ వైద్య నిపుణులు చెబుతున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచితేనే

సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. లేకుంటే డెంగీ, మలేరియా, తదితర దోమకాటు వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు. చెత్త సేకరణ, ఫాగింగ్, స్ప్రేయింగ్ ఎప్పటికప్పుడు చేయించాలి. ప్రజలు సైతం స్వీయ నియంత్రణ జాగ్రత్తలు తప్పక పాటించాలి. సమస్య తీవ్రతరం కాకుండా జిల్లా అధికార యంత్రాంగం డీఎంహెచ్ఓ, ఏరియా ఆస్పత్రుల ఇన్‌చార్జ్‌లను మేలుకొలిపే విధంగా తగు చర్యలు తీసుకుంటే బాగుంటుందని ఆరోగ్యశాఖ వర్గాలంటున్నాయి.

అనంతపురం సర్వజనాస్పత్రిలో రోజువారీగా వైద్య సేవలు

ఓపీ (ఔట్ పేషెంట్)	2,600	
ఇన్‌పేషెంట్ (ఐపీ)	1,100 మంది	
పడకలు	మెడిసిన్ విభాగం 150	చిన్నపిల్లల వార్డు 90
ప్రస్తుతం అడ్మిషన్‌లో	300 కు పైగానే..	

యాంటీ బయాటిక్స్ వాడొద్దు



రెస్పరేటరీ వైరల్ ఫీవర్స్, దోమకాటు ఫీవర్స్ అధికంగా వస్తున్నాయి. ప్రజలు భయపడాల్సిన పని లేదు. కానీ సురక్షిత ప్రమాణాలు, ముందస్తు జాగ్రత్తలు తప్పకపాటించాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమకాటుకు గురికాకుండా చూసుకోవాలి. మాస్క్ ధరించడం, అవసరమైనప్పుడు చేతులకు శానిటైజ్ చేసుకోవాలి. జ్వరం వచ్చింది కదా అని, అనవసరంగా యాంటీ బయాటిక్స్ జోలికి వెళ్లొద్దు. పండ్లు, తదితర మంచి పౌష్టికాహారం తీసుకోవాలి. స్వచ్ఛమైన నీటిని రోజూ ఆరు గ్లాసులపైగా తాగాలి. మూడు రోజుల కంటే అధికంగా జ్వరం ఉంటే వైద్యుల సూచనలతో రక్త పరీక్షలు చేసుకోవాలి.

– డాక్టర్ యాసర్ అరాఫత్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి

మహిళా ఇంజినీర్ ఆత్మహత్య

- మానసిక కుంగుబాటే కారణం

అనంతపురం: హెచ్చెల్సీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.సుమియ (32) ఆత్మహత్య చేసుకున్నారు. మానసిక కుంగుబాటుకు గురై ఆమె ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీ సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలంలోని రామప్ప వీధిలో నివాసం ఉండే కొండకమర్ల బాబాసాహెబ్ రెండో కుమార్తె కె.సుమియకు గుంతకల్లుకు చెందిన పామిడి మహమ్మద్ షఫీతో 2020లో వివాహమైంది. ఈమె అనంతపురంలో హెచ్చెల్సీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ ఆర్.కె.నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి మూడేళ్ల వయసున్న మన్హా సాఫియా, రెండేళ్ల వయసున్న మహిరా ఇరమ్ సంతానం. రెండో కాన్పు తర్వాత నుంచి సుమియాకు హార్మోన్ల సమతుల్యం లోపించడంతో మానసికంగా కుంగుబాటుకు గురయ్యారు. ఈ నేపథ్యంలో మానసిక వైద్య నిపుణుడి వద్ద చికిత్స చేయించుకుంటున్నారు. వారం రోజులుగా మాత్రలు వేసుకోకపోవడంతో మానసిక రుగ్మత అధికమైంది. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని పలు దఫాలుగా ప్రయత్నించగా కుటుంబ సభ్యులు వారించారు. ఈ విషయాన్ని మహమ్మద్ షఫీ తన మామ బాబాసాహెబ్‌కు చెప్పాడు. దీంతో ఆయన గురువారం సుమియా ఇంటికి వచ్చారు. ఆమెకు నచ్చచెప్పి డాక్టర్ వద్ద చూపించారు. అయినా కూడా సుమియా నిద్రకపోకుండా తాను చనిపోతానంటూ ఏడుస్తూనే ఉండటంతో తండ్రి, కుటుంబ సభ్యులు ఓదార్చారు. అదే రోజు రాత్రి 10 గంటలకు అందరూ కలిసి భోజనం చేసి, నిద్రపోయారు. సుమియా, ఆమె భర్త షఫీ, చిన్నపిల్లలు ఒక బెడ్ రూంలో నిద్రపోయారు. శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో కుమార్తె నిద్రపోయిందా లేదా అని బాబాసాహెబ్ గదివైపు రాగా.. అప్పటికే సుమియా చీరతో ఫ్యానుకు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దింపి ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తీసుకెళ్లారు. డాక్టర్లు పరీక్షించి సుమియా చనిపోయిందని నిర్ధారించారు. మృతురాలి తండ్రి, భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేశారు.

బాబ్బాబు. బార్లకు రండి!

- లైసెన్సులకు దరఖాస్తు చేసుకోండంటూ వేడుకోలు
- సర్కారు టార్గెట్‌తో వీధినపడ్డ ఎక్సైజ్ అధికారులు
- ఒక్కో బార్‌కు కనీసం 10 దరఖాస్తులు రావాలని ఆదేశాలు
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికీ ఒక్క దరఖాస్తూ రాని దుస్థితి

సర్కారు మందు దెబ్బకు అధికారులు వీధినపడ్డారు. ఇప్పటికే పర్మిట్‌రూములు, బెల్టుషాపులతో పల్లెలు మత్తులో జోగుతుంటే తాజాగా బార్లలో పూటుగా తాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా తాజాగా జారీచేసిన బార్ల నోటిఫికేషన్‌కు దరఖాస్తులు భారీగా వచ్చేటట్టు చూడాలని ఎక్సైజ్ కమిషనర్ ఆదేశించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులు బార్ల లైసెన్సుకు దరఖాస్తులు వెయ్యండంటూ ఊరూరా తిరుగుతున్నారు.



గుంతకల్లులో ధాబాలు, హోటళ్ల యజమానులతో సమావేశమైన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

ఉమ్మడి అనంత జిల్లాలో బార్ల వివరాలు..

ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన బార్ల సంఖ్య	32
ఏడాదికి కట్టాల్సిన సొమ్ము	రూ.55 లక్షలు
కట్టాల్సిన ఇన్‌స్టాల్‌మెంట్‌లు	6
దరఖాస్తుకు చెల్లించాల్సింది	రూ.5 లక్షలు
దరఖాస్తుకు చివరి తేదీ	ఆగస్టు 26

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం ఇటీవల నూతన బార్ పాలసీ ప్రకటించింది. బార్ల లైసెన్సులకు నోటిఫికేషన్ జారీ చేసింది. వారం కావస్తున్నా ఒక్క దరఖాస్తూ రాలేదు. దీంతో ఎక్సైజ్ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులపై మండిపడ్డారు. 'మీరు ఏం చేస్తారో మాకు తెలియదు. ఒక్కో బార్‌కు కనీసం 10 దరఖాస్తులు రావాలి. అంతకంటే తక్కువ వస్తే బావుండదు' అంటూ కోప్పడ్డారని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 32 బార్లు ఉన్నాయి. ఈ లెక్కన 320 దరఖాస్తులు రావాలనేది సర్కారు లక్ష్యం.

ఉరుకులు, పరుగులు

మూడు రోజులుగా ఉమ్మడి అనంతపురం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్ రెడ్డిలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. ధాబాలు, రెస్టారెంట్ల ఓనర్లు, కల్లుగీత (ఈడిగ) సంఘాల ప్రతినిధులను పిలిపించుకుని బతిమాలుతున్నారు. 'మీకు మంచి భవిష్యత్తు ఉంటుంది.. మీరు బార్ లైసెన్సుకు దరఖాస్తు చెయ్యండ'ని అభ్యర్థిస్తున్నారు. ఇప్పటికే అనంతపురం, గుంతకల్లు, పుట్టపర్తి తదితర చోట్ల పిలిపించుకుని సమావేశాలు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి ధాబాలు నిర్వహించుకునే ఓనర్లను కూడా పిలిపించి 'మీకు మేమున్నాం.. మా మాట విని దరఖాస్తు చేయండి మీకు మంచి లాభాలు వస్తాయి. ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకూ వ్యాపారం చేసుకోవచ్చు.. మీ ఇష్టం వచ్చినంత రేటుకు అమ్ముకోవచ్చు' అంటూ పేరు పేరునా పిలిచి వేడుకున్నంత పని చేస్తున్నారు.

అధికారులకు ఇదేమి దుస్థితి?

జిల్లా అధికారులే దరఖాస్తుల కోసం ఊరూరా తిరుగుతూ బతిమాలుతున్న దుస్థితిపై ఎక్సైజ్ సిబ్బందిలో తీవ్ర చర్చ జరుగుతోంది. నోటిఫికేషన్ ఇస్తే ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటారు. కానీ ఆదాయం కోసం సర్కారు దిగజారి వ్యవహరిస్తోందని విమర్శలొస్తున్నాయి.

యూరియాపై జాయింట్ టాస్క్‌ఫోర్స్

అనంతపురం అగ్రికల్చర్: యూరియా సరఫరా, క్రయవిక్రయాలపై జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. యూరియా అంశంపై శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ తదితరులు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, వ్యవసాయశాఖ, సహకార శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూరియా కొరత ఏర్పడకుండా నిఘా ముమ్మరం చేయడానికి వీలుగా వ్యవసాయశాఖ, సహకార శాఖ, మార్క్‌ఫెడ్, పోలీసు, రెవెన్యూశాఖలతో జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. రోజువారీ తనిఖీల నివేదికను హెచ్ఎల్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌కు అందజేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో కలెక్టర్ వినోద్‌కుమార్ జిల్లాలో ఐదు తనిఖీ బృందాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ నేతృత్వంలోని ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ వెంకటకుమార్ బృందం శుక్రవారం సాయంత్రం స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో చైర్మన్ నెట్టెం వెంకటేశులు, బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్ తదితరులతో సమావేశమయ్యారు. ఈ సీజన్‌లో సరఫరా అయిన యూరియా, రైతుల జాబితా గురించి ఆరాతీశారు. 415 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించినట్లు, అందుకు సంబంధించి బిల్లులు, రసీదులు ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఎరువులు నిల్వ చేసిన గోదాములను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరి బృందం ప్రైవేట్ హోల్‌సేల్ గోదాములు, జిల్లా సహకార అధికారి (డీసీవో) అరుణకుమారి బృందం శింగనమల ప్రాంతంలో, వీరితో పాటు మరో రెండు బృందాలు రాయదుర్గం ప్రాంతంలో మెరుపుదాడులు, తనిఖీలు చేపట్టి యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

యూరియాపై ఆందోళన వద్దు

యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఎరువులకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (85002 92992)ను సంప్రదించాలని సూచించారు. అన్ని రకాల ఎరువులతో పాటు యూరియా కూడా జిల్లాలో సరిపడా అందుబాటులో ఉందన్నారు.

26న మట్టిగణపతులు, పూజా సామగ్రి ఉచిత పంపిణీ

అనంతపురం: జిల్లా కోర్టులోని నూతన బార్ బిల్డింగ్‌లో ఈ నెల 26న ఉచిత మట్టి గణపతులు, పూజా సామగ్రిని జిల్లా జడ్జి భీమరావు, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఆలూరి రామిరెడ్డి, రిటైర్డ్ జడ్జి ఎం.కిష్టప్ప చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అనంతపురం అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు హనుమన్న పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఆవిష్కరించారు. మట్టిగణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆర్. బాలాజీ నాయక్, సెక్రటరీ ఎం.కృష్టప్ప, జాయింట్ సెక్రెటరీలు ఎం. శ్రీనివాసులు, ఎన్. జగదీష్ పాల్గొన్నారు.



● చెట్టంత ప్రేమ

ఇల్లు కట్టాలంటే అడ్డుగా ఉన్న చెట్లను నరికేయడం పరిపాటి. అయితే అనంతపురం నడిబొడ్డున కమలానగర్‌లో చెట్టును కొట్టేయకుండా ఇల్లు నిర్మించి మొక్కల పెంపకంపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నాడు ఓ యజమాని. తాను పెంచిన టెంకాయ చెట్టు పూర్తి స్థాయిలో ఎదిగేలా దాని మార్గాన్ని వదిలి నిర్మించిన ఇల్లు చూపరులను ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

హరికృష్ణ సతీమణిని అవమానిస్తే చర్యలుండవా?

- జూనియర్ ఎన్‌టీఆర్‌పై ఎమ్మెల్యే దగ్గుపాటి వ్యాఖ్యలు దుర్మార్గం
- సాటి నటుడి తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే పవన్ కల్యాణ్ స్పందించరా?
- ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'దివంగత ఎన్టీఆర్ కోడలు, నందమూరి హరికృష్ణ సతీమణి, జూనియర్ ఎన్‌టీఆర్ తల్లిని ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడిన అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌పై సీఎం చంద్రబాబు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎన్టీఆర్ స్థాపించిన పార్టీలో ఉన్న ఎమ్మెల్యేను చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారు. సతీమణి భువనేశ్వరిపై ఎవరో వ్యాఖ్యలు చేశారంటూ నానా యాగీ చేసిన చంద్రబాబు.. వరుసకు సోదరి అయిన జూనియర్ ఎన్టీఆర్ తల్లిపై వ్యాఖ్యలు చేస్తే స్పందించరా? తోటి నటుడి తల్లిని అవమానిస్తే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరుమెదపరా?' అని వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన అనంతపురంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యేల అరాచకాలు పెచ్చుమీరాయన్నారు. టీడీపీకి చెందిన కొందరు ఎమ్మెల్యేల అరాచకాలు తారస్థాయికి చేరాయని, మహిళల పట్ల కూడా అనుచితంగా మాట్లాడడం, వ్యవహరించడం కళ్లారా చూస్తున్నామన్నారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లిని ఉద్దేశించి ఎమ్మెల్యే దగ్గుపాటి దారుణంగా మాట్లాడారన్నారు. అయినా ఇలాంటి వారిని సీఎం ప్రోత్సహిస్తూ, పైకి మాత్రం వారిపై ఆగ్రహంతో ఉన్నట్లు నటిస్తున్నారని విమర్శించారు. 'నేను కొట్టినట్టు కొడతా..మీరు ఏడ్చినట్టు ఏడ్వండి' అన్న చందంగా బాబు తీరు ఉందన్నారు. ఇటీవల అనంతపురంలో ఓ మైనార్టీ మహిళను కూడా ఎమ్మెల్యే దగ్గుపాటి దుర్భాషలాడారన్నారు.

బాబూ కొడుకులకు కోట్లు గుమ్మరించారట

టికెట్ కోసం సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్‌కు రూ.కోట్లు గుమ్మరించామని, ఇప్పుడు ఆ డబ్బు సంపాదించుకోవడం తమ హక్కు అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు బాహాటంగానే చెబుతున్నారన్నారు. ప్రశాంతంగా ఉండే అనంతపురంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరాచకాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరాయన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారని, త్వరలోనే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

దివ్యాంగులతో కలెక్టరేట్ ముట్టడిస్తాం

కూటమి ప్రభుత్వం జిల్లాలో 9,601 మంది దివ్యాంగుల పింఛన్లను తొలగించి విశ్వాసఘాతుకానికి పాల్పడిందని అనంత మండిపడ్డారు. పింఛన్లను పునరుద్ధరించకపోతే దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులతో కలసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు సాకే చంద్రశేఖర్, ఓబిరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివరామిరెడ్డి, నగరాధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ కమల్‌భూషణ్, నాయకులు తనీష, కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, చిదంబర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పేరం స్వర్ణలతకు వైఎస్ జగన్ పరామర్శ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న పేరం స్వర్ణలత

తాడిపత్రి టౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలతను ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా శుక్రవారం పరామర్శించారు. అనారోగ్య కారణంగా శస్త్రచికిత్స చేయించుకుని తన స్వగృహంలో ఆమె విశ్రాంతి తీసుకుంటున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆమెతో వైఎస్ జగన్ పేర్కొన్నారు. ఎలాంటి సాయం అందించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని భరోసానిచ్చారు. ఆమె భర్త పేరం అమర్‌నాథరెడ్డితో మాట్లాడుతూ.. పేరం కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి కూడా ఆమెను ఫోన్‌లో పరామర్శించారు. అలాగే స్వర్ణలత ఇంటికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భార్య రమాదేవి, రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి దంపతులు, మాజీ ఎంపీ తలారి రంగయ్య దంపతులు చేరుకుని ఆమె ఆరోగ్య స్థితిగతులు ఆరా తీశారు.

వక్క చెట్ల నరికివేత



కుందుర్పి: మండలంలోని వెంకటంపల్లి గ్రామానికి చెందిన రైతు హనుమంతరెడ్డి తోటలోని వక్క చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. నాలుగేళ్ల క్రితం 80 వక్క మొక్కలను రైతు నాటాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు తోటలోకి ప్రవేశించి 80 చెట్లను నరికి వేశారు. కాపు దశలో న్న చెట్లను నరికి వేయడంతో దాదాపు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కరెంట్ శాఖలో కలెక్షన్ కింగ్‌లు



అనంతపురంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న ఈ భవనానికి విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకుండానే 7 విద్యుత్ సర్వీసులను మంజూరు చేశారు. 11 కేవీ విద్యుత్ లైన్ లేకపోయినా భవన యజమానితో లబ్ధి పొంది విద్యుత్ సంస్థ ఆదాయాన్ని కొల్లగొట్టినట్లు ఆరోపణలున్నాయి. ఎస్టిమేషన్ వేసి ఉంటే సంస్థకు రూ.4 లక్షలకుపైగా ఆదాయం సమకూరేది.

అనంతపురం నగరంలోని రెండో రోడ్డు సమీపంలో ఉన్న ఈ భవనానికి ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండానే ఐదు నెలల క్రితం విద్యుత్ శాఖ అధికారులు ఏడు విద్యుత్ సర్వీసులతో పాటు లిఫ్ట్‌కు అవసరమైన 3 ఫేజ్ కనెక్షనూ మంజూరు చేశారు. కనెక్షన్ ఇచ్చే ముందు ఆ భవనానికి ఎన్ని కిలో వాట్ల విద్యుత్ అవసరమవుతుందో గుర్తించి, ఆ మేరకు ఎస్టిమేషన్ రూపొందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఎస్టిమేషన్ లేకుండానే కనెక్షన్లు మంజూరు చేయడంతో సంస్థకు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లింది.



...ఈ రెండూ కేవలం ఉదాహరణ మాత్రమే. ఉన్నతాధికారుల అండతోనే కొందరు అక్రమార్జనకు తెరలేపడంతో సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- ముడుపులిస్తే ఎస్టిమేషన్ లేకుండానే విద్యుత్ కనెక్షన్లు
- విద్యుత్ సంస్థ ఆదాయానికి భారీగా గండి
- అక్రమార్కులకు ఉన్నతాధికారుల అండ

అనంతపురం టౌన్: విద్యుత్ సంస్థలో పని చేస్తున్న కొందరు అధికారులు నిబంధనలు తుంగలో తొక్కి విద్యుత్ అక్రమ కనెక్షన్లు జారీ చేస్తూ కలెక్షన్ కింగ్‌లుగా మారారు. ఇష్టారాజ్యంగా విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తూ సొంత ఖజానాలను నింపుకోవడంతో సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది.

సంస్థపై అదనపు భారం

విద్యుత్ అక్రమ కనెక్షన్ల ఫలితంగా అనంతపురంలోని చాలా ప్రాంతాల్లో లో ఓల్టేజీ పెరిగి వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సంస్థ ఏటా రూ.కోట్ల ఖర్చుతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సి వస్తోంది. భారీ భవంతులకు ముందుగానే ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ సర్వీసులను మంజూరు చేస్తే లో ఓల్టేజీ సమస్యకు ముందుగానే చెక్ పెట్టవచ్చు. అయితే విద్యుత్ శాఖలో క్షేత్రస్థాయిలో పని చేస్తున్న కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా ఎలాంటి ఎస్టిమేషన్లు లేకుండానే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడంతో లో ఓల్టేజీ సమస్యకు కారణమవుతున్నట్లు సమాచారం. గడిచిన ఏడాది కాలంలో రూ.15 కోట్లకు పైగా ఖర్చు చేసి అనంతపురంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సంస్థ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసిందంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో ఊహించుకోవచ్చు.

చర్యలకు వెనుకడుగు

విద్యుత్ అక్రమ కనెక్షన్లపై చర్యలు తీసుకునేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పలుమార్లు అక్రమ విద్యుత్ కనెక్షన్లపై పత్రికల్లో కథనాలు వెలువడినా అక్రమార్కులపై చర్యలు చేపట్టకపోవడమే ఇందుకు నిదర్శనం. విచారణ పేరిట కాలయాపన చేయడం తప్ప సంస్థ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై తీసుకున్నచర్యలు ఏమీ లేవు. ఇది మరికొందరికి ఊతమిచ్చింది. యూనియన్ల మాటున అక్రమంగా విద్యుత్ సర్వీసులను మంజూరు చేస్తూ సొంత జేబులు నింపుకోవడం పరిపాటిగా మారింది. అనంతపురం నగరంలోని డీ5, డీ3 విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని బళ్లారి రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, గుత్తి రోడ్డు, భైరవనగర్ తదితర ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. పెద్ద పెద్ద భవంతులు, మాల్స్ ఏర్పాటు అవుతున్నాయి. వీటికి విద్యుత్ కనెక్షన్లు ఇష్టారాజ్యంగా మంజూరు చేస్తుండడంతో ఆయా ప్రాంతాలలో విద్యుత్ సమస్యలు నానాటికీ తీవ్ర మవుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అక్రమ కనెక్షన్లకు అడ్డు కట్ట వేయకపోతే సంస్థ నష్టాల్లో కూరుకుపోవడం ఖాయమనే వాదనలు సొంత శాఖలోని కొందరు ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది.

చర్యలు తీసుకుంటాం



ఎస్టిమేషన్ లేకుండా విద్యుత్ సర్వీసులు అక్రమంగా మంజూరు చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం. ఐదు సర్వీసులు దాటితే కచ్చితంగా ఎస్టిమేషన్ వేయడంతోపాటు విధిగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. ట్రాన్స్‌ఫార్మర్ లేకుండా సర్వీసులు జారీ చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– శేషాద్రి శేఖర్, విద్యుత్ శాఖ ఎస్ఈ, అనంతపురం

జాతీయ సాహస శిబిరానికి ఎంపిక



ఎంపికైన విద్యార్థి గౌతమ్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

రాయదుర్గం టౌన్: స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం (బీఎస్సీ) విద్యార్థి జె.గౌతమ్ జాతీయ సాహస శిబిరానికి ఎంపికయ్యాడు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ శుక్రవారం వెల్లడించారు. జాతీయ పర్వతారోహణ సంస్థ ఆధ్వర్యంలో అరుణాచల్‌ప్రదేశ్‌లో దిరాంగ్ గ్రామంలో అడ్వెంచర్ స్పోర్ట్స్ పై ఎన్‌సీసీ క్యాడెట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిబిరానికి తమ కళాశాలలోని ఎన్‌సీసీ యూనిట్‌కు చెందిన గౌతమ్ ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించి, వీడ్కోలు పలికారు.

నేడు మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్/టౌన్: వినాయక చవితిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం 'మట్టి వినాయక విగ్రహాల తయారీ' పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజినీర్ పీవీ కిషోర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు అనంతపురంలోని శారదా నగరపాలక ఉన్నత పాఠశాలలో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి 6–10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. విగ్రహాల తయారీకి అవసరమైన బంకమట్టి, నీటిని సమకూర్చుతామన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాల వల్ల, వాటి అలంకరణకు వాడుతున్న కృత్రిమ రంగుల వల్ల నీటి, నేల కాలుష్యం జరిగి పర్యావరణ విధ్వంసానికి దారితీస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులలో పర్యావరణ స్పృహ పెంచాలనే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైభవంగా షంషేర్ ఉత్సవం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండలోని హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారి షంషేర్ వేడుక శుక్రవారం వైభవంగా జరిగింది. పామిడి బాషు అంగడి నుంచి షంషేర్‌ను శుభ్ర పరిచి రాయదుర్గం బుడేన్ సాహెబ్ ఇంటి నుంచి మేళతాళాలతో దర్గాకు చేర్చారు. అనంతరం శుక్రవారం వేకువజాము 2 గంటలకు గుర్రంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించి, తిరిగి దర్గాకు చేర్చి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు దర్గా కమిటీ అధ్యక్షుడు హోతూరు బాషా, సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఖవ్వాలి పోటీలు ఆకట్టుకున్నాయి.



దర్గా వద్ద భక్తుల సందడి

దివ్యాంగుల ఉసురు తగలక మానదు

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చే దమ్ములేక దివ్యాంగుల పింఛన్లను తొలగించేందుకు సిద్ధమైన కూటమి సర్కార్‌కు వారి ఉసురు తగిలి తీరుతుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే 4.15 లక్షల వృద్ధాప్య పింఛన్లు తొలగించి అర్హులకు అన్యాయం చేసిందన్నారు. తాజాగా మరో 2 లక్షల దివ్యాంగుల పింఛన్లను తొలగించేందుకు కుట్ర సాగుతోందన్నారు. వైద్యులకు టార్గెట్ ఇచ్చి పింఛన్ల తొలగింపునకు సిద్ధమైన ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామన్నారు.



దివ్యాంగుల పింఛన్ల రద్దు దుర్మార్గం : సీపీఎం

గుంతకల్లు టౌన్: సొంత పనులు కూడా చేసుకోలేని అసహాయుల పింఛన్లను రద్దు చేయడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు ధ్వజమెత్తారు. రీ వెరిఫికేషన్ పేరిట అర్హులైన దివ్యాంగుల పెన్షన్లు రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ దివ్యాంగులతో కలసి శుక్రవారం మున్సిపల్ ఆఫీసు ఎదుట ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. దివ్యాంగులపై కూటమి ప్రభుత్వానికి కనికరం లేదని మండిపడ్డారు. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకు ఇలాంటి కుట్రలకు తెరలేపడం తగదని, తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించకపోతే మున్సిపల్ ఆఫీసును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి రోడ్డుపై బైఠాయించిన సీపీఎం నాయకులు

యువకుడి బలవన్మరణం

పెద్దవడుగూరు: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన సుందర్ (35) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పోషణ, ఇంటి నిర్మాణానికి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.3 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హెవీ మోటార్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం రూరల్: జిల్లాలోని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువతకు హెవీ మోటార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కుముదా శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 20 ఏళ్ల వయసు దాటిన యువతీయువకులు ఈ నెల 27వ తేదీ లోపు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. 40 ఏళ్లు దాటితే మెడికల్ సర్టిఫికెట్ అందజేయాల్సి ఉంటుంది. ఏడాది కాల పరిమితి ఉన్న లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్‌తో పాటు ఆధార్, కుల ధ్రువీకరణ, రేషన్ కార్డు జత పరచాలి. ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులకు మాత్రమే ఎంపిక చేసి శిక్షణ ఇస్తారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

తాడిపత్రి టౌన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికురాలి పర్సులోని బంగారు నగలు, నగదును దుండగులు అపహరించారు. బాధితురాలు తెలిపిన మేరకు.. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోటపాడు గ్రామానికి చెందిన మారుతమ్మ శుక్రవారం తన కుమారుడిని తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి పిలుచుకువచ్చారు. చికిత్స అనంతరం తిరుగు ప్రయాణమైన ఆమె ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని బెంచీలపై కుమారుడితో పాటు తన బ్యాగ్‌ను వదిలి వాటర్ బాటిల్ కొనుగోలు చేసేందుకు పక్కనే ఉన్న దుకాణానికి వెళ్లారు. తిరిగి వచ్చి బ్యాగ్ చూసుకోగా అందులో ఉన్న పర్స్ కనిపించలేదు. ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో రూ.7 వేల నగదుతో పాటు రెండు బంగారు ఉంగరాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మొరాయించిన '108'

శెట్టూరు: ప్రజలకు అత్యవసర సేవలు అందించాల్సిన 108 వాహనం శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ రోడ్డుపైనే మొరాయించింది. శెట్టూరు మండలానికి కేటాయించిన ఈ వాహనం శుక్వరారం ఉదయం కళ్యాణదుర్గం నుంచి వస్తుండగా మార్గమధ్యంలో సాంకేతిక సమస్య తలెత్తి చీకటి పడే వరకూ రోడ్డుపైనే నిలిచిపోయింది.



అప్పు చెల్లించలేదని దాడి

ధర్మవరం అర్బన్: అప్పు చెల్లించలేదంటూ ఓ లారీ డ్రైవర్‌పై వడ్డీ వ్యాపారి దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. నార్పల మండలానికి చెందిన గోదిన గురుప్రసాద్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడాది క్రితం తాడిపత్రి పట్టణానికి చెందిన జోసఫ్‌తో రూ.50 వేలను అప్పుగా తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో కంతులు సక్రమంగా చెల్లించలేకపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 18న లారీలో సిమెంట్ లోడ్‌తో వెళుతున్న గురుప్రసాద్‌ను ధర్మవరంలోని మార్కెట్‌యార్డు వద్ద జోసఫ్ అడ్డుకుని తన అనుచరులు బాబా ఫక్రుద్దీన్, ఖాసీం, సునీల్, అబ్దుల్లా, మరో వ్యక్తితో కలసి విచక్షణారహితంగా దాడి చేశాడు. బెల్టు, కాళ్లు, చేతులతో కొట్టడంతో తీవ్రంగా గాయపడిన గురుప్రసాద్ తన సొంతూరికి వెళ్లి కోలుకున్న తర్వాత శుక్రవారం ధర్మవరం రెండో పట్టణ పీఎస్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. దీంతో దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సోషల్ మీడియాతో సమాజానికి కీడు

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

అనంతపురం సిటీ: సామాజిక మాధ్యమాల (సోషల్ మీడియా) విపరీత ధోరణి సమాజానికి కీడే ఎక్కువ జరుగుతోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. సంచలనాల పేరుతో నిజాలు నిర్ధారించుకోకుండా ఇష్టమొచ్చినట్లు ప్రచారం, ప్రసారం చేయడం వల్ల ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ క్యాంపస్‌లో ఉన్న డీపీఆర్‌సీ భవన్‌లో శుక్రవారం జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) ఉమ్మడి జిల్లా మహాసభ జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర యాదవ్ అధ్యక్షత వహించగా.. యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు రవితేజ, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరెడ్డి అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ.. సమాజానికి ఉపయోగపడే విధంగా కథనాలు ఉండాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ రెన్యువల్‌కు చర్యలు తీసుకున్నామన్నారు. అక్రిడిటేషన్ కమిటీల్లో అన్ని సంఘాలకు అవకాశం కల్పిస్తామన్నారు. భవిష్యత్‌లో జర్నలిస్టులకు మరింత చేయూతనందిస్తామని పేర్కొన్నారు. సమాజ శ్రేయస్సు జర్నలిజంతోనే ముడిపడి ఉందని ఉప్పల లక్ష్మణ్ అన్నారు. అయితే చాలా మంది జర్నలిస్టులు అక్రమార్కుల కొమ్ము కాస్తు నిజాలను రాయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నిజాలే రాయాలని, అప్పుడే మెరుగైన సమాజ నిర్మాణంలో మన పాత్ర పోషించిన వారమవుతామని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో తమ యూనియన్ ముందుంటుందని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలి

అనంతపురం: జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ , ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను అన్ని రకాలుగా అన్ని శాఖల వారు ప్రోత్సహించాలన్నారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను జారీ చేసి పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి విరివిగా రుణాలు మంజూరు చేయాలని ఎల్డీఎంను ఆదేశించారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభమైన సందర్భంగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాప్‌రెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కర్ష్'లో జిల్లాను అగ్రస్థానంలో నిలపండి

ధర్తీ ఆబ జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం అమలులో జిల్లాను అగ్రస్థానంలో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. పథకంపై న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ పోర్టల్ ప్రదర్శన నిర్వహించింది. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీసీలో కలెక్టర్‌తో పాటు డీటీడబ్ల్యూఓ శ్రీనివాస రావు, సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ధర్తీ ఆబ జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం కింద గుంతకల్లు మండలం గుండాల తండా, వజ్రకరూరు మండలం వెంకటంపల్లి చిన్న తండా, పెద్ద తండా, శింగనమల మండలం నాగుల గుడ్డం, నాగుల గుడ్డం తండా గ్రామాలు ఎంపికైనట్లు వివరించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో 20 శాఖల అధికారులను సమన్వయం చేసుకుని వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని ఇతర గ్రామాలలో అభివృద్ధి పనులు చేసేందుకూ సిద్ధంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటం కొనసాగిస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్ అన్నారు. అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కులాల మధ్య విబేధాలు రేకెత్తించి రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జూలుకుంట కేశవ ప్రసాద్, అరవింద్ కుమార్, శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రత్నాకర్

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగులకు సన్మానం


విద్యుత్ ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు పొందిన విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసులు, ఎల్ఐ బాషా, లైన్‌మెన్ వెంకటనారాయణలను డీ5 సెక్షన్ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఆ శాఖ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ మునిరాజ్, విద్యుత్ ఉద్యోగులు మస్తానయ్య, సూర్యనారాయణ, పరమేష్, నాగేంద్రరెడ్డి, పవన్, శ్రీనాథ్, బయపురెడ్డి పాల్గొన్నారు.

శాంతి ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం నగర వీధుల్లో శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక ఎన్జీవో హోమ్ నుంచి పెన్నర్ల భవన్ వరకు విద్యార్థులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని తొలుత ఎస్ఎస్బీఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. మానవతా సంస్థ చైర్మన్ శీలా జయరామప్ప, కో చైర్మన్ డాక్టర్ నరసింహారెడ్డి, కన్వీనర్ గంగిరెడ్డి, కార్యదర్శి ప్రకాష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పాపంపేట వాసి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... దూదేకుల షెక్షా చేపల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో తరచూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13న ఇంటి నుంచి వెళ్లిన షెక్షా తిరిగి రాలేదు. చాలాచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.


డీజేలకు అనుమతి లేదు

రాప్తాడురూరల్: వినాయక ఉత్సవాలను అందరూ భక్తిభావంతో ప్రశాంతంగా జరుపుకోవాలని అనంతపురం రూరల్ సీఐ శేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల పేరుతో ఇష్టానుసారంగా డీజేలు పెట్టుకుని ఇబ్బందులు కల్గించకూడదని పేర్కొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో లక్ష్మీదేవి అమ్మవారిని కొలువుదీర్చి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలతో కలిసి సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈఓ విజయరాజు, ధర్మకర్త సుగుణమ్మ పూజా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వామ్మో.. కుక్కల బెడద



- వీధుల్లో తిరగాలంటే భయపడుతున్న జనం
- పాపంపేటలో కుక్కలధాటికి బెంబేలెత్తుతున్న వైనం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పంచాయతీ అధికారులు


పాపంపేట ఆంజనేయస్వామి గుడి వద్ద రాత్రిపూట రోడ్డుపై కుక్కల హల్‌చల్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట వాసులు కుక్కల బెడదతో అల్లాడిపోతున్నారు. వీధుల్లో గుంపులుగా తిరుగుతూ వాహనదారులతో పాటు పాదచారులపై దాడి చేస్తున్నాయి. కుక్కల ధాటికి మరీ ముఖ్యంగా ద్విచక్రవాహనాల్లో వెళ్తున్న పలువురు ప్రమాదాలకు గురై గాయపడ్డారు. పాపంపేట ఆంజనేయస్వామి ఆలయం వెనుక, జిల్లా పరిషత్ పాఠశాల వద్ద, ప్రధానరోడ్డు రాజా హోటల్ ఎదురుగా కుక్కలు దాడి ఎక్కువగా ఉంటోంది. దీనికితోడు వీధుల్లో కుక్కలు గట్టిగా అరుస్తూ నిద్రాభంగం కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగరాజు, తిమ్మరాజు అనే యువకులు ఇటీవల రాత్రి సినిమాకు వెళ్లి బైకులో ఇంటికి వెళ్తుండగా పాపంపేట జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలో ఉన్న కుక్కల గుంపు ఒక్క ఉదుటున గట్టిగా భౌ..భౌ అంటూ ఆ యువకుల మీదకు వచ్చాయి. భయంతో స్పీడుగా తోలే క్రమంలో వారు అదుపుతప్పి కింద పడ్డారు. అలాగే రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తిపై ఆంజనేయస్వామి గుడి కూడలిలో ఉన్న కుక్కల గుంపు మీదికి వచ్చింది. ఆయన ఒక్కసారిగా బైకు నిలబెట్టి గట్టిగా కేకలు వేయడంతో వెనుదిరిగాయి. ఆయన బైకు ఎక్కి ముందుకు వెళ్లే ప్రయత్నం చేయగా మళ్లీ వెంబడించాయి.

ఇళ్లముందు స్వైర విహారం

ఆంజనేయస్వామి గుడి కూడలి, జిల్లా పరిషత్ పాఠశాల కూడలిలో గుంపులు గుంపులుగా చేరుతున్న కుక్కలు రాత్రిపూట రెచ్చిపోతున్నాయి. ఇళ్లముందు అపరిశుభ్రం చేస్తున్నాయంటూ మహిళలు వాపోతున్నారు. ఉదయం లేవగానే వాటిని శుభ్రం చేయలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట కుక్కలు ఒక గుంపుపైకి మరో గుంపు దాడులు చేసుకుంటూ గట్టిగా అరుస్తున్నాయని తెలిపారు. ఇళ్ల ముందు చిన్న పిల్లలు ఆడుకుంటుంటారని ఏ క్షణంలో వారిపై దాడి చేస్తాయోనని తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కలు కల్గిస్తున్న ఆటంకం గురించి పంచాయతీ అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా కనీస చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఏదైనా పెను ప్రమాదం జరిగితే తప్ప అధికారులు పట్టించుకునేలా లేరని స్థానికులు శ్యాంసుందర్, సుబ్రమణ్యం, రవికుమార్, రిటైర్డ్ టీచరు శ్రీరాములు, డంబు రమేష్, నరేష్, లారా తదితరులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధికుక్కల దాడి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

డీడీఓ కార్యాలయ భవన గుర్తింపు ప్రక్రియ కొలిక్కి


డీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయనున్న భవనం

అనంతపురం సిటీ: అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీస్ (డీడీఓ) కార్యాలయం ఏర్పాటుకు భవన ఎంపిక ప్రక్రియ శుక్రవారానికి ఓ కొలిక్కి వచ్చింది. అనంతపురం రూరల్ పరిధిలోని రామకృష్ణ నగర్ కాలనీ (టీవీ టవర్ సమీపంలో)లోని గ్రామ సచివాలయం-2 భవనాన్ని ఎంపిక చేశారు. కింది భాగంలో సచివాలయం యథావిధిగా కొనసాగేలా.. పై అంతస్తులో డీడీఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌తో పాటు డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, డివిజనల్ పంచాయతీ అధికారిని ఒకే గొడుకు కిందికి తెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటి వరకు కొనసాగిన డీఎల్‌డీఓ క్యాడర్‌ను డీడీఓగా మారుస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

నూతన మూల్యాంకన విధానాన్ని ఉపసంహరించుకోవాలి


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న పీఆర్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందికరంగా మారిన నూతన మూల్యాంకన విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పీఆర్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఉత్తమ జిల్లా అధికారి అవార్డు అందుకున్న డీఈఓను సన్మానించారు. అనంతరం పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిమ్మారెడ్డి మాట్లాడుతూ నూతన మూల్యాంకనం వల్ల ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గతంలో పరీక్షలు అయిన వెంటనే జవాబు పత్రాలను ఇళ్లకు తీసుకెళ్లి దిద్దేవారన్నారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. పుస్తకాలు రూపంలో ఇవ్వడంతో వాటిని తీసుకెళ్లడానికి సాధ్యంకాదన్నారు. దీంతో పాఠశాల సమయంలోనే వాటిని మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు. ఈ కారణంగా బోధనా సమయాన్ని వృథా చేస్తూ మూల్యాంకనం చేస్తున్నారన్నారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎ.కేశవరెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎం.శివారెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రామమూర్తి, నాయకులు రామమోహనరెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, వేమారెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బందులు


డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణ, మూల్యాంకనానికి ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ బదిలీ పొంది రిలీవ్ కాని ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ వారిని నియమించి బదిలీ పొందిన వారిని రిలీవ్ చేయాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ వాడుకోటానికి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. వేసవిలో సప్లిమెంటరీ విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరు చేయాలన్నారు. డీఈఓను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు కె చంద్రశేఖర్, ఫణిభూషణ్, శివయ్య ఆచారి, ఎస్.సురేష్‌బాబు, వి.రాజశేఖర్, నాగభూషణ, మురళీకృష్ణ, రామకృష్ణ, యుగంధర్, సుధాకర్, జనార్దన్, ఎం.శ్రీనివాసులు, చంద్రశేఖర్‌స్వామి పాల్గొన్నారు.

బోధన కంటే మూల్యాంకనానికే ఎక్కువ సమయం

అనంతపురం ఎడ్యుకేషన్: అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం కొత్త విధానం తీసుకురావడంతో టీచర్లు బోధన కంటే కూడా మూల్యాంకనానికే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని గిరిజన ఉపాధ్యాయ సంఘం నేతలు వాపోయారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, డెగావత్ రవీంద్రనాథ్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ విద్యా సంవత్సరంలో నూతన మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో పుస్తకాన్ని అందించి.. అందులో ఓఎంఆర్ కూడా ఉంచారన్నారు. నాలుగు అసెస్మెంట్ పరీక్షలతో పాటు మూడు సమ్మేటివ్ అసెస్మెంట్లు టూల్ 1,2,3,4గా పొందుపరిచారని తెలిపారు. ఒక విద్యార్థి పుస్తకాన్ని మూల్యాంకనం చేయాలంటే అరగంట సమయం పడుతుందన్నారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ ప్రారంభమైనప్పటి నుంచి ఉపాధ్యాయులు బోధన కంటే మూల్యాంకానికే ఎక్కువగా పరిమితమయ్యారని వాపోయారు. ప్రభుత్వం దీనిపై పరిశీలించి, మేధావులతో చర్చించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఒత్తిడి లేకుండా చూడాలని కోరారు. గతంలో పరీక్ష అయిపోయిన వెంటనే జవాబుపత్రాలను ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసుకొని స్కూలుకు తెచ్చేవారని గుర్తు చేశారు. దీనివల్ల సమయం వృథా అయ్యేది కాదన్నారు. ప్రస్తుత విధానంతో ఉపయోగం కంటే నష్టమే ఎక్కువ జరుగుతోందన్నారు.

మా జీవితాలతో ఆడుకోవద్దు

- పింఛన్ల తొలగింపు అన్యాయం
- రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట దివ్యాంగుల నిరసన


ధర్నా చేస్తున్న వికలాంగులు, సీపీఎం నాయకులు

రాప్తాడు: "మాకు పింఛనే డబ్బే ఆధారం. దాన్ని తొలగించి మా జీవితాలతో ఆడుకోవద్దు. పింఛన్ పొందేందుకు మాకు అన్ని అర్హతలున్నాయి. అందుకే ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నాం. ఇప్పుడు రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్ తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసులివ్వడం దుర్మార్గం" అని పలువురు దివ్యాంగులు వాపోయారు. మండలంలోని పలువురు దివ్యాంగుల పింఛన్లను రద్దు చేసి కూటమి ప్రభుత్వం నోటీసులివ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట వికలాంగుల హక్కుల జాతీయ వేదిక, సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో దివ్యాంగులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్రపతి అధ్యక్షుడు రామయ్య, సీపీఎం రాప్తాడు రూరల్ ప్రాంతీయ కార్యదర్శి టీ.రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెదన్న, శ్రీసత్యసాయి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న తదితరులు మాట్లాడారు. ఎన్నికల వేళ చంద్రబాబు పింఛన్ మొత్తం పెంచుతామని హామీ ఇస్తే అందరూ ఆనందపడ్డారన్నారు. ఇప్పుడు పెంచడం మాటే మోగానీ ఉన్న పింఛన్లకు కోత వేస్తున్నారని మండిపడ్డారు. గతంలో 90 శాతానికిపైగా వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్లు ఉన్నవారికీ ఇప్పుడు 40 శాతం వికలత్వం చూపించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో దాదాపు 600 మంది పింఛన్లను వివిధ కారణాలతో తొలగించడం అన్యాయమన్నారు. ఇకనైనా కూటమి సర్కార్ అర్హులైన వారందరికీ ఎటువంటి షరతులు లేకుండా పింఛన్లు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు.

అంబులెన్స్‌లో తీసుకువచ్చి...

అంతకుముందు ఎం.చెర్లోపల్లికి చెందిన 19 ఏళ్ల హర్షితతో పాటు గోగుల శాంతమ్మను అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. హర్షిత పుట్టుకతో దివ్యాంగురాలు కాగా, చేతులు, కాళ్లు పని చేయవు. మాటలు కూడా రావు. ఇక గోగుల శాంతమ్మకు వెన్నముక దెబ్బ తినడంతో ఆమె మంచానికే పరిమితమైంది. గతంలో వీరిద్దరికీ రూ.15 వేల పింఛన్ వచ్చేది, ప్రస్తుతం రీవెరిఫికేషన్‌లో 50 శాతం వికలత్వం ఉన్నట్లు చూపి వీరిద్దరి పేర్లు రూ.6 వేల పింఛన్ జాబితాలో చేర్చారు. వారిద్దరినీ శుక్రవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. వీరి పింఛన్లకు రీవెరిఫికేషన్‌కు వచ్చిన డాక్టర్లు ఇంటి లోపలికి కూడా వెళ్లకుండా బయట నుంచే చూసి వారికి 50 శాతం మాత్రమే వికలత్వం ఉన్నట్లు నమోదు చేశారని నాయకులు మండిపడ్డారు. వెంటనే ఆ వైద్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

జగన్మాతా.. నమోస్తుతే


పూజలందుకున్న కొల్హాపురి మహాలక్ష్మి

అనంతపురం కల్చరల్: చివరి శ్రావణ శుక్రవారం నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ లక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తులు అమ్మవారిని శరణు కోరారు. సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు నిర్వహించారు. రామనగర్‌లో పెద్దమ్మ తల్లి, శంకర మఠంలో శారదామాత, శ్రీశివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, శివకోటి తదితర చోట్ల అమ్మవారికి పూజలు జరిగాయి. కొత్తూరు, పాతూరు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు, హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ, కొల్హాపురి మహాలక్ష్మి, చెరువుకట్ట నిముషాంబాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాగా.. శ్రావణ శుక్రవారం సందర్భంగా నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ప్రతినిధి డాక్టర్ నిర్మల ఆధ్వర్యంలో నగరంలోని 21 మంది మహిళా ఆటో డ్రైవర్లకు చీరలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు.

బాధిత కుటుంబానికి చేయూత


చికిత్స పొందుతున్న జగదీష్.. ఆర్థికసాయం అందిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఇటీవల ఓ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న జగదీష్ కుటుంబానికి పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చేయూతనిచ్చారు. శుక్రవారం ఆదరణ సేవా సమాజ్ ట్రస్టు, ఫ్రెండ్స్ సొసైటీ ప్రతినిధులు తాడిమర్రి లాల్‌బాషా తదితరులు జగదీష్ భార్య అంజలికి రూ.52,300 ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న జగదీష్ రోడ్డు ప్రమాదానికి గురవడం బాధాకరమన్నారు. ఆయన త్వరగా కోలుకోవడానికి మరింతమంది వైద్యఖర్చులకు సాయమందిస్తే బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముంతాజ్, షకీలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఝల్లుమన్న జానపదం


జానపద నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: రాయలసీమ, తెలంగాణ జానపద నృత్యాలతో అనంత డ్యాన్సు మాస్టర్లు, చిన్నారులు హోరెత్తించారు. ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి నగరంలోని లలిత కళా పరిషత్తులో 'జిల్లా జానపద జాతర' పేరిట నృత్యోత్సవం నిర్వహించారు. ప్రజాదరణ పొందిన పలు జానపద గీతాలపై 200 మంది చిన్నారులతో పాటు 11 మంది డ్యాన్సుమాస్టర్లు అద్భుత అభినయంతో ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా నాట్యాచార్యులు సంధ్యామూర్తి, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, చిత్రకారుడు కత్తి విజయ్‌కుమార్ హాజరై.. చిన్నారులకు బహుమతులు అందజేశారు.

కుళాయి కనెక్షన్‌ను క్రమబద్ధీకరించుకోవాలి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని నీటి కుళాయి కనెక్షన్ కల్గిన అసెస్‌మెంట్‌దారులు క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పేర్కొన్నారు. నెల రోజుల్లో క్రమబద్ధీకరించుకోకుంటే కనెక్షన్లు తొలగించడంతో పాటు భవిష్యత్తులో కనెక్షన్ పొందాలంటే రెట్టింపు చార్జీలు వసూలు చేస్తామన్నారు.

ఆగి ఉన్న బొలెరోను ఢీకొన్న బైక్

- ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

రాప్తాడురూరల్: రోడ్డు పక్క ఆగి ఉన్న బొలెరో వాహనాన్ని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం రూరల్ ఎస్ఐ కొమ్మినేని రాంబాబు తెలిపిన వివరాల మేరకు... కంబదూరు మండలం తిప్పేపల్లికి చెందిన ఎరుకుల శివన్న అనంతపురం రూరల్ మండలం సిండికేట్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు భార్య హేమావతి, కూతురు, కుమారుడు ఉన్నారు. శివన్నకు ఊరిలో వ్యవసాయ భూమి ఉంది. వేరుశనగ సాగు చేశాడు. అప్పుడప్పుడు అక్కడికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో గురువారం గ్రామానికి వెళ్లి పంటను పరిశీలించి సాయంత్రం తిరిగి బయలుదేరాడు. అనంతపురం శివారులోని కళ్యాణదుర్గం రోడ్డు సెయింట్ జాన్స్ స్కూల్ సమీపంలో బొలెరో వాహనం టైరు పంక్చర్ కావడంతో పక్కన ఆపాడు. వెనుక నుంచి వస్తున్న శివన్న బొలెరో వాహనాన్ని గమనించకుండా వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని ఎస్ఐ తెలిపాడు. రాత్రిపూట ప్రయాణాలు చేసేవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

ప్రారంభ దశలోనే కేన్సర్‌ను గుర్తించాలి

అనంతపురం మెడికల్: కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి సూచించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో కళ్యాణదుర్గం, గుంతకల్లు ఆస్పత్రికి చెందిన వైద్యాధికారులకు కేన్సర్ వ్యాధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్, హ్యాండ్స్ ఆన్ ట్రెనింగ్ ద్వారా స్పెషలిస్టు డాక్టర్లతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

కనగానపల్లి: స్త్రీనిధి రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శుక్రవారం ఆమె కనగానపల్లిలో డ్వాక్రా సంఘాల మహిళలకు స్త్రీ నిధి రుణాలను సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాయితీ వడ్డీతో అందించే రుణాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్త్రీనిధి బ్యాంకు ద్వారా కనగానపల్లి మండలానికి 513 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ 4.46 కోట్లు మంజూరు చేసినట్లు వెలుగు డీపీఎం సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టం వెంకటేష్, మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, ఏపీఎం హేమలత, మండల గ్రామైక్య సంఘం లీడర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.